కథలూ

"శ్యామసుందర్"

"అయితే మీరు సిద్ధంగా వున్నారన్నమాట!" అని ఒక్కసారి వనజ, సరస వంక చూశారు శ్రీపతిగారు.

వనజ, సరస అనే పేర్లనుబట్టి ఆడవాళ్ళని అనుకునే ఆస్కారం లేక పోలేదు. కాని నిజానికి వీళ్ళిద్దరూ నూటికి నూరుపాళ్ళు పురుషులే. కాని కథకులవటం వల్ల స్త్రీ రూపం దాల్చారు. మొదట్లో కొన్నాళ్ళు స్వంత పేర్లతో చాలా కథలు వ్రాసి అందుబాటులో వున్న పత్రికలకు పంపించేవారు. పాపం వాటిని యెంతో కష్టపడి వ్రాసేవాళ్ళు. వాటికోసం నిద్రమానుకుని అర్థరాత్రిళ్ళు దీపాలముందు కూర్చుని వ్రాయబోతుంటే భార్యలు "యేమిటండీ, నిద్ర పోనీకుండా యెదురుగా దీపం, మీరూనూ" అని విసుక్కున్నా సహించి నానా అవస్థలు పడి కథ పూర్తిచేసి మరునాడు తీరిగ్గా మరోమాటు చదువుకుని భేషుగ్గా వుందని తృప్తిపడేవాళ్ళు. ధీమాగా పత్రికలకు పంపేవారు అందులో వనజగారికి యెక్కువ శ్రమ తీసుకునే అలవాటున్నది. కథ పత్రికకు పంపించిన మరు రోజునుంచి స్నేహితులకు చుట్టాలకు "నేఫలానా కథ రాశాను - ఫలానా పత్రికలో పడుతుంది. ఫలానా రోజుల్లో చూసిచదవరూ" అని చాటుకునేవాళ్ళు. అలా యింకా పడుతుంది—చివరకు యివ్వాళో రేపో అని అనుకుంటుండగా పోష్టు జవాను తిరిగి తెచ్చి యిచ్చేవాడు ఆరోజు టపాలో. ఇలా తిరిగివస్తున్న కథలు యెక్కువై యెక్కువై చివరకు వీళ్ళిద్దరూ పేరుమార్పుతో మళ్ళీ పంపించటం మొదలెట్టారు అవే కథల్ని. అవే పత్రికలు అవే కథల్ని పేరు మార్పుతో ప్రకటించి యీ పురుష స్త్రీలకు ప్రోత్సాహమివ్వటం మూలంగా యీనాడు వనజ, సరస గార్లు, ఘరానా కథకులై వెలుగుతున్నారు.

"వో, సిద్ధంగా వున్నాం" అన్నారు వనజ, సరసగార్లు.

శ్రీపతిగారు సిగరెట్ తీసి తనొకటి వెలిగించి, వాళ్ళిద్దరికీ చెరివకటి యిచ్చారు. వాళ్ళు సిగరెట్లు కాల్చుకున్నారు.

"ఇక వినండి" అని శ్రీపతిగారు మొదలెట్టారు. "మావూళ్ళో మా యింటి ప్రక్కన రాఘవయ్య గారని ఒకాయన వుండే వారు. వారికి సరిగ్గా నా వయస్సే వున్న వక కొడుకు వున్నాడు. వాళ్ళింటి ప్రక్క యింట్లో వక వకీలుగారు వుండేవారు. వారికి నలుగురు పిల్లలు. అందులో రాధ అనే అమ్మాయి పెద్దది. రాఘవయ్యగారి కొడుకు మురళి, వకీలు గారమ్మాయి రాధా యిద్దరూ ప్రక్కయింటి పిల్లలవటం వల్ల కలిసిమెలసి ఆడుకుంటూ చదువుకుంటూ వుండేవాళ్ళు చిన్నప్పుడు. పెరిగి పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళిద్దరూ వకర్ని వకరు గాఢంగా ప్రేమించుకున్నారు. ఒకళ్ళని విడిచి వకళ్ళు బ్రతకలేమనుకున్నారు. చివరకు పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. కాని అదృష్టం బావుండక రాధకు వేరేసంబంధానికి పెళ్ళయిపోయింది. తరువాత మురళి చాలారోజులు విచారించాడు నిరాశతో. చివరకు మతిస్థిమితంకోసం ఉద్యోగంలో చేరాడు" అంటూ ఆపి చివరిదాకా కాలిపోతున్న సిగరెట్ పీకను అవతల కిటికీలోగుండా బయట పారేశాడు శ్రీపతి. వనజ సరసలు 'వూ, తర్వాత' అని గట్టిగా చివరి దమ్ము పీల్చి సిగరెట్ పీకల్ని అవతల పారేశారు.

మళ్ళీ శ్రీపతి మొదలుపెట్టాడు: "మురళి ఉద్యోగంలో చేరటానికి మదరాసు వెళ్ళాడు. ఆఫీసుకెళ్ళాడు. తనుచేరి పనిచెయ్యాల్సిన సెక్షన్ సూపరింటెండెంట్ గారిని కలుసుకోటానికి మరో గదిలోకెళ్ళాడు. సూపరింటెండెంట్ గారిని చూచేటప్పటికి మురళీ ఆయనాగూడా కొంచెం ఆశ్చర్యపోయారు. వాళ్ళిద్దరూ చిన్నప్పుడు మురళీ వాళ్ళవూళ్ళో ఎలిమెంటరీ స్కూలులో చదువుకున్నారు. తరవాత సూపరింటెండెంట్ తండ్రి రెవిన్యూ ఇన్స్పెక్టరు అవటంవల్ల మరోవూరు ట్రాన్స్ఫరై వెళ్ళిపోయారు. చిన్ననాటి మిత్రులు తిరిగి అనుకోకుండా అప్రయత్నంగా కలుసుకోవటం యిద్దరికీ ఆనందాన్నిచ్చింది. అందుకని—" అని యింకా శ్రీపతి చెప్పబోతుండగా వనజ "మురళిని కొత్తవూళ్ళో గదిదొరకేదాకా తనింట్లోనే వుండమని సూపరింటెండెంట్ గారు అని అతన్ని వాళ్ళయింటికి తీసుకు వెళ్ళివుంటారు సంతోషంగా" అని మిగతాదాన్ని పూర్తిచేశాడు.

సరస, వనజ చెప్పింది యెంతవరకు నిజమో తెలుసుకోటానికి శ్రీపతి ముఖంలోకి తదేకదృష్టితో ఆత్రుతతో చూస్తున్నాడు.



శ్రీపతి "అవును. అంతే. అలా మురళిని తనింటికి తీసుకెళ్ళాడు" అన్నారు.

వనజ విజయగర్వంలో సరస వంక చూశాడు.

"పొద్దుపోయేదాకా మిత్రులిద్దరూ తమ చిన్ననాటి విషయాల్ని తలుచుకుంటూ కాలం గడిపారు. తరువాత యిద్దరు భోజనాలకు లేచారు. ఇద్దరూ పీటలమీద కూర్చున్నారు. మురళి, మిత్రుడు చెపుతున్న మాటలకు 'ఊఁ' కొడుతున్న వాడల్లా ఒక్కసారిగా" అని యింకా శ్రీపతి చెప్పబోతుండగా సరసగారు "మిత్రుని భార్యని చూసేసరికి మురళి కొయ్యబారిపోయాడు ఒక్క క్షణం" అని అందించాడు.

వనజ "ఆ చరిత్ర మీకిదివరకే తెల్సా" అని అడిగాడు సరసగార్ని. "ఈమాత్రం ఊహించలేకపోతే మనం కథలు వ్రాయట మెందుకు" అంటూ వనజకు సమాధానం చెప్పి, తను చెప్పింది 'అవునో-కాదో' తెలుసుకోటానికన్నట్లు శ్రీపతి వంక చూశాడు సరస.

శ్రీపతి "నిజమే మీరన్నట్లు మురళి ఒక్క క్షణంపాటు కొయ్యబారిపోయాడు. తన మిత్రుని భార్య తన చిన్నప్పటి రాధ, తనని ప్రేమించిన రాధ, తను చేసుకోందామనుకున్న రాధ, తనను చేసుకోమని అన్న రాధ." అన్నారు.

సరస, వనజగార్లు తమ స్వంత జేబుల్లోంచి సిగరెట్లు తీసి వెలిగించారు. శ్రీపతిగారు వాళ్ళవంక ఒక్క క్షణం చూసి తన జేబులోంచి సిగరెట్ తీసి తనూ వెలిగించారు.

"భోజనాలయినయ్" అంటూ మళ్లీ మొదలెట్టారు శ్రీపతి. "ఇద్దరు మిత్రులూ వాకిట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తాంబూలాలు వేసుకుంటున్నారు. అంతలో వాళ్ళ ఆఫీసు జవాను రాఘవులు వచ్చాడు.

"ఎందుకురా వచ్చావ్" అన్నాడు మురళి మిత్రుడు.

"పి. ఎ. గారు ఇంకో అరగంటలో ఆఫీసుకు వస్తారట. తమర్నిగూడా రమ్మన్నారండి" అని చెప్పిపోయాడు రాఘవులు.

"అయితే నువ్విప్పుడు ఆఫీసుకెళ్ళాలా" అడిగాడు మురళి.

ఆ. వెళ్లాలి. చచ్చేటంత పనివుంది. ఒక్కొక్కప్పుడు తెల్లవారుతుంది కూడా. అట్లాంటప్పుడు కాఫీగూడ తాగి రావటం అలవాటు ప్రొద్దున్నే." అన్నాడు మిత్రుడు.

"మరి కొంచెం సేపటికి మురళి మిత్రుడు బట్టలు వేసుకుని ఆఫీసుకు పోతూ "నీకు మేడమీద పక్క వేయించాను. నే వచ్చేటప్పటికి ప్రొద్దుపోతుందేమో, పెందలా పడుకో" అని వెళ్లిపోయాడు," అని ఆపారు శ్రీపతిగారు.

"ఇక మీరు చెప్పనక్ఖర్లేదు. మేమే చెప్తాం" అన్నాడు సరస.

"ఇదేనా-ఇంకా ఎంతపెద్ద సమస్యో అనుకున్నా" అన్నాడు వనజ. శ్రీపతి "సరే-అయితే చాల క్లుప్తంగా త్వరగా, చెరో కాయితంమీద పూర్తిచేయండి కథను" అన్నాడు.

వనజ, సరసగార్లు వెంటనే తెల్లకాయితాల్ని తీసుకున్నారు. చెరో కొత్త సిగరెట్ తీసి వెలిగించారు. ఆ విధంగా నిశ్చలంగా కూర్చుని వ్రాయటం మొదలుపెట్టారు కథ చివరి భాగాన్ని. కొంతసేపయిన తరువాత యిద్దరూ "వ్రాశాం" అన్నారు.

శ్రీపతి "అయితే యిలా యివ్వండి." అని యిద్దరిదగ్గర్నించి కాయితాలుతీసుకున్నారు. మొట్టమొదట వనజ వ్రాసిన కాయితం తీసి చదవటం మొదలెట్టాడు శ్రీపతి.

"మురళి మేడమీదకెళ్ళి పక్కమీదపడుకున్నాడు. ఎంతసేపటికి నిద్రపట్టలేదు. అటూయిటూ పొర్లాడు చాలా సార్లు. తలంతా ఏవో ఆలోచనలతో నిండిపోయింది. కిటికీలోగుండా ఆకాశంలోకి చూశాడు. చందమామను కారుమబ్బు కమ్మివేస్తోంది. తను సిగరెట్టు వెలిగించాడు. అటూయిటూ పచార్లు చేశాడు. హృదయం ఘోషపెడుతోంది. చికాకు మరింత ఎక్కువయింది. ఆవేశం పైకి చిందటానికి ప్రయత్నిస్తోంది. కాని నరాలు గట్టిగా పట్టుపట్టాయి. మళ్ళీ పడుకున్నాడు. నిద్దరారాలేదు. కాళ్ళుఆడించాడు. జుట్టులోకి చేయిదూర్చి తలగట్టిగా పట్టుకున్నాడు. ఆలోచనలు పరుగెత్తిపోతున్నాయి. ఆకాశంలో మళ్ళీ కిటికీలోంచి చంద్రుణ్ణి చూశాడు. చంద్రుడు కనిపించటం లేదు, మబ్బు పూర్తిగా కప్పివేసింది. గది తలుపులు తెరచాడు. నెమ్మదిగా చీకటిలోనే మెట్లు దిగుతున్నాడు. మెట్ల వంపుదగ్గర గన్నేరుచెట్టుమాటున ఏదో కదలిక అయింది. ఆగిపోయాడు మురళి

★ కథలూ, కథకులూ ★

అనుమానంతో, ఒక్క మెట్టు మళ్ళీ కిందకు దిగాడు. గన్నేరుచెట్టుక్రింద రాధ నుంచుని వుంది. మురళి ఆశ్చర్యపోయాడు. కాని ఏం మాట్లాడలేకపోయాడు. రాధకూడా మాట్లాడాలని ప్రయత్నించినా పలకరించలేకపోయింది. చివరకు మురళి 'రాధా' అన్నాడు. రాధ మారుపలుకలేదు. ఇద్దరూ చెరో అడుగు దగ్గరకొచ్చారు. 'మనం చిన్నప్పుడు ఎంతో అనుకున్నాం – ఎంతో ఆశించాం – ఎన్నో కలలు కన్నాం' అన్నాడు మురళి. "అవును" అంది రాధ ముక్తసరిగా చివరికి.

"కాని భగవంతుడు చిన్నచూపు చూశాడు. తలవ్రాతలు మారిపోతే మనమేం చేయగలం. విధిని ఎదిరించలేకపోయాం, చివరికి చెరోకదారి అయినాం—కాని" అన్నాడు మురళి ఉద్రేకంగా.

"కాని—నీవు పెళ్లి చేసుకున్నావా" అంది రాధ.

"దానిసంగతి అలావుంచు—యింతవరకు లేదు–కాని" మళ్ళీ మురళి సగంలోఆపాడు.

"కాని—ఏదో చెప్పదలచి ఆపేశావేం" అంది రాధ బాధగా.

"ఏం లేదు. చివరిసారిగా నా చిన్నప్పటి రాధగా నిన్ను పలుకరించాలనిపించి వచ్చాను. అదృష్టవంతుణ్ణి అన్నాడు.

"అంతవరకే నేనూ కోరింది—యిదే చివరిసారి" అంది రాధ.

"అవును. ఇదే చివరిసారి. ఇంతటితో మన చిన్నప్పటి కథల జ్ఞాపకం సమాధిచేయబడాలనే నా కోరిక. నువ్వదృష్టవంతురాలివి రాధా! నా మిత్రుడెంతో మంచివాడు. ఇక నించి నిన్ను నాతోబుట్టువుగా చూచుకుంటాను. ఇట్లా నిన్ను అర్ధరాత్రి ఒంటరిగా కలుసుకోటానికి ప్రయత్నించినందుకు క్షమించు" అని మైమరిచిపోయాడు.

"నువ్వు నిజంగా మంచివాడివి. నేకోరింది అంతవరకే—ఇక మనం, మన పూర్వ చరిత్రను మరచి మామూలు మిత్రులవ మల్లే బ్రతుకుదాం" అంది రాధ.

తర్వాత కొంచెంసేపు మౌనంగా వుండి యిరువురు ఎవరి శయనమంది

మీ ఉద్యోగమేమి?

వ్యాపారియా, ఫ్రానుసామానులు తయారు చేయువారా...ఎలెక్ట్రిషియనా., మెకానిక్కా...హాబీయిస్టా?

అయితే మీ కత్యవసరమైనది 'ఉల్ఫుకబ్బు'—దృఢమైన, శక్తివంతమైన, ఇంతకు ముందు ఎన్నడు లభించని మీ శక్తికి తగిన ఖరీదులో దొరకు ¼ అం. ఎలెక్ట్రిక్ డ్రిల్లు.

'ఉల్ఫుకబ్బు' డ్రిల్లుతో ప్రారంభించి మీ కర్మాగారమును ఇతర విద్యుచ్ఛక్తిచే పనిచేయు పనిముట్లతో నింపుడు.

'ఉల్ఫుకబ్బు.' డ్రిల్లింగ్, పాలిషింగ్, సాయింగ్, మరియు చేతి పనిముట్లతో చేయుట వలన కలుగు అలసట, ఇబ్బందులను లేక చేయుచున్నది. అది బహు వ్యాపకమైనది, తేలికైనది మరియు ఉపయోగించుటకు సులభమైనది. మీరు తక్కువ శ్రమతో ఎక్కువ పనము పొంద గలరు.



Wolf Cub



రాలీస్ ఇండియా లిమిటెడ్.
320, లింగిచెట్టి స్ట్రీట్, మదరాసు. బొంబాయి • కలకత్తా • ఢిల్లీ.

లకు వాళ్లు వెళ్ళారు" అని వనజ వ్రాసిన కౌయితాన్ని చదివి మడిచి అవతలపెట్టి మళ్లీ సరస వ్రాసింది చదవటం మొదలెట్టారు శ్రీపతిగారు.

"మురళికి నిద్రపట్టలేదు! ఏదో... తీరని వ్యథ...మనసులో వుంది! ఎన్నాళ్లబట్టో హృదయంలో జీర్ణించిన ఆలోచనలు... ఒక్కసారి కట్లు తెంచుకోటానికి ప్రయత్నిస్తున్నయ్! మురళి దుర్బలుడు కొవటం వల శరీరం అతనిపట్టు విడిపించుకుంది! గబగబా మురళి...అద్దంముందు నుంచుని... ముఖం చూచుకున్నాడు! ముఖం చెమట బిందువులతో...గజిబిజిగా...వుంది! ఏదో ...గంభీరంగా కన్పడుతున్న...చిన్న మనస్సుతో...తలుపు తెరిచాడు! బయట... ఉరుములు ఉరుముతున్నై...గాలి జోరున వీస్తోంది...వర్షం...చిన్న చిన్న తుంపరలుగా ప్రారంభించింది......మురళి దొంగలాగా మేడమెట్లు దిగి నెమ్మదిగా......తలుపు తట్టాడు! ఒకటి రెండుసార్లు...తలుపు తట్టిం తరువాత...తలుపు తెరువబడింది! లోపల రాధ కన్పించింది...ఒక్క క్షణం ఏం మాట్లాడలేకపోయాడు మురళి...చివరకు "రాధా" అన్నాడు...అణచుకున్న ఆవేశంతో! మరో క్షణం తరువాత "ఎందుకు వచ్చారు" అంది రాధ శివంలాగా!!

"ఎందుకో—ఎందుకో?"అని తన హృదయాన్ని తడుముకున్నాడు మాటలకోసం మురళి!

"ఆ—ఎందుకు" అడిగింది రాధ మరింత గంభీరంగా...!

"ఎందుకో-వచ్చాను- ఆఖరిసారి నిన్ను-నిన్ను కలుసుకుని హృదయంలోని బాధ చెప్పటానికి—నువ్వు నన్ను మోసంచేశావ్... ప్రేమించానని ఆశపెట్టావ్! నన్ను ఊరించావ్! చివరకు నన్ను నడిసముద్రంలో ముంచి...ఏకాకిని చేశావ్! వేరొకరిని పెళ్లాడావ్! నీకోసం...నీకోసం..."

"నే నేం మోసంచేశాను? మోసం చేసింది నేను కాదు... నువ్వు... చిన్నప్పటినించి నన్నే చేసుకుంటానన్నావ్... కాని సమయం వచ్చేసరికి మీ వాళ్లకు చెప్పే ధైర్యం లేక వూరు వదలివెళ్లావ్...నువ్వే నన్ను మోసం చేశావ్...నాకోసం, నీ మాట నిలబెట్టుకోటంకోసం ఏం చేశావ్—" అంది రాధ. రాధ ఉగ్రురాలయింది!

"ఏం చేశానా...నీ పెళ్లివిషయం నాకు తెలీదు. సెలవులకు యింటికొచ్చేసరికి పెళ్లయిందన్నారు. తరువాత యింకేం చేస్తాను. నీకోసం విచారించాను... విలపించాను... మరచిపోదామని ప్రయత్నించి విఫలుణ్ణయి ...చివరకు నిద్రాహారాలు మాని...చివరకు మతిపోయి ఆరోగ్యం చెడగొట్టుకుని పిచ్చివాడిలాగా...దిక్కులేనివాడిలాగా తిరిగాను!"

"మంచిపని చేశావ్...మతి లేకపోవటం వల్ల నే అవివేకంగా చేశావ్...లేకపోతే నాకు పెళ్ళయిఅత్తవారింటికి వెళ్లింతరువాత నన్ను గురించి ఆలోచించటం...నిద్రాహారాలు మానటం...విలపించటం...మతి పోగొట్టుకోటం దేనికి?? అవును నీకు మతి వుంటే... మొదటే ధైర్యంతో మీవాళ్లతో చెప్పేవాడివి...నిజంగా నే నీకు మతి లేదు...నీకు మతిపోయింది... నా పెళ్లి అయింతరువాత నావల్ల కాదు...నీకు పుట్టుకతోనే మతి లేదు" అంది రాధ.

"లేదూ..నన్ను హేళనచేస్తున్నావా... నువ్వు...నువ్వు..." అని పెద్దగా అరవబోతుండగా.

"మర్యాదగావెళ్లిపడుకో...నీబోటివారికి ఆశ్రయమివ్వటం మావారి మంచితనం వల్ల. ముందు నువ్విక్కణ్ణించి వెళ్లు" అంది రాధ గర్జిస్తూ!!

వెళ్ళను...నాకు లేని సుఖం నీకు ఎందుకుండాలి- వీల్లేదు - నువ్వు నాలాగా విలపించాలి - తలనేలకు బాదుకు చావాలి" అని మురళి లోపలికి అడుగు వేయబోతుండగా...

రాధ "ఛీ!" అంటూ తలుపులు దభీమని వేసేసింది.!

తలుపు సందుల్లో మురళి చిటికినవేలు పడి నలిగింది! "అబ్బ" అన్నాడు!

చివరకు ఉక్రోషంతో, నిరాశతో... తనగదిలోకొచ్చాడు..వానలో తడుస్తూ... సొమ్మసిల్లి అర్ధరాత్రికి నిద్రపోయాడు..." అంటూ శ్రీపతిగారు సరసవ్రాసిన కథ చివరి భాగాన్ని చదివారు.

శ్రీపతిగారి ముఖం గంభీరంగావుంది. సరస వనజగారు శ్రీపతి ముఖకవళికలబట్టి ఏ కథ ముగింపు నిజంగాజరిగిందో తెల్సుకుందామని పడ్డతాపత్రయం వృధా అయింది.

చివరకు శ్రీపతి "నేను జరిగిన కథ చెపుతాను వినండి" అని మొదలెట్టారు. "మరునాటి ఉదయం మురళిని కాఫీకి పిలవటానికి పనిమనిషిని పైకి పంపించాడు మురళి మిత్రుడు. మురళీ కాఫీత్రాగటానికి క్రింద కొచ్చి కాఫీ తాగుతూ.

"రాత్రి ఎన్నిగంటలకు వచ్చావ్" అన్నాడు.

"ఒక గంటలో తిరిగివచ్చాను. మా ఆఫీసరు ఆఫీసులో పనిచేయటానికి రాలేదు. ఇవ్వాళ క్యాంప్ వెళ్ళబోతూ ఏవో కొన్ని విషయాలు చెప్పటానికి పిలిపించాడు. అంతే. అందుకనే అంత త్వరగా రాగలిగాను."

"పోనీ, వచ్చింతరువాత పిలవక పోయావ్ సరదాగా సినిమాకన్నా వెళ్ళేవాళ్ళం" అన్నాడు మురళి.

"పిలిచాను. నాలుగయిదు సార్లు తలుపుతట్టి పిలిచాను. కాని నువ్వు లేవలేదు. గుర్రుపెట్టి నిద్రపోతున్నట్టున్నావ్. సరే పోనీ, ప్రయాణంబడలికమీద పడుకొని వుంటావ్ అని తిరిగివచ్చాను." అన్నాడు మిత్రుడు.

"అబ్బ అంతనిద్ర పోయానన్నమాట. నాకు రాత్రి పడుకోటానికి మంచం మీదకు వెళ్ళటం జ్ఞాపకముంది. మళ్లీ కళ్లు తెరిచేసరికి తెల్లారింది" అన్నాడు.

"అయితే మాగదిలో హాయిగానిద్రపట్టిందన్నమాట," అంటూ "లే, మళ్లీ బజారు వెళ్ళొద్దాం" అన్నాడు, మిత్రుడు," అని శ్రీపతిగారు ఆపేసి"ఇంతకూ ఆమురళిని నేనే. కాని ఆనాటి రాత్రి నాకు ఎలాంటి అభిప్రాయాలు, ఆలోచనలు లేకుండా హాయిగా నిద్ర పట్టింది." అంటూ సిగరెట్లు అందిచ్చాడు. వనజ, సరసగార్లు తెల్లముఖాలేసి సిగరెట్లను గబగబా పీలుస్తున్నారు. పొగ యిద్దరి ముఖాల్ని కప్పివేసింది.

కాని కథ చెప్పిన శ్రీపతిగారు కూడ కథకులే. ★

ఆ చెడు
దగ్గును
అపుటకు
పెప్సును
సేవించుడు

దగ్గులు, జలుబులు, గొంతు నొప్పి, రొమ్ము పడిసెము, ఇన్‌ఫ్లుయంజ మరియు ఇతర గొంతు, గుండె జబ్బులు, గుండెకు, ఊపిరి తిత్తులకు ప్రమాదకరంగా అమిత శ్రమను గలిగించును. పెప్సుతో తక్షణ విముక్తిని పొందుడు. పెప్సులోని శమనకర, అంటు నిరోధక ఔషధసారములు, దగ్గులను అపును, మంటతో గూడిన వాపును రహిత మొనర్చి, రేగిన నొప్పిని శమనపర్చి, ప్రమాదకర క్రిములను నశింపజేయును.
పిన్నలు, పెద్దలు కూడ, సేవించ వచ్చును. ఇందు హానికర ఓషధులు లేవు.

PEPS

పెప్స గొంతు మరియు
గుండెల అంటు నిరోధక బిళ్లలు
FPY-39-TEL

సోల ఏజంట్లు: ...
86, సెనప్పనాయక్ వీధి, మద్రాసు.